రామ మందిరాన్ని పునర్‌నిర్మించుకోవడం సంతోషం

మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు



కేపీహెచ్‌బీ కాలనీలోని శివాలయంలో శుభ్రపరుస్తున్న మురళీధర్‌రావు, కాంతారావు

కూకట్‌పల్లి: అయోధ్యలో శ్రీరామమందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను శుభ్రం చేయాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గురువారం కూకట్‌పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో అసెంబ్లీ పరిధిలోని కేపీహెచ్‌బీ రోడ్ నం.3లోని శివాలయం ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రమణ ఇరువురిని శాలువాతో సత్కరించారు.

◆ ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ.. 500 ఏళ్ల తర్వాత జనవరి 22న రామ మందిరాన్ని పునర్ నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేవాలయాల స్వచ్ఛతను ఉద్యమంలా నిర్వహించాలన్నారు. మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం తేదీ ప్రకటించినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఉత్సాహం, సంతోష వాతావరణం నెలకొందన్నారు. ఇప్పటికే ఇంటింటికీ అయోధ్య శ్రీరాముల వారి పూజిత అక్షింతలు చేరాయని తెలిపారు. ఈనెల 22న ఇంటింటా రామజ్యోతి వెలిగించడం దీపావళిని జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ కమిటీ సభ్యులు వినోద్, రవి, సూరిబాబు, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ సభ్యులు, హిందూ బంధువులు, కాలనీవాసులు, ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జికి కంచె లేదు..

- అధికారులకు సోయి లేదు
- భయాందోళనలో వాహనదారులు



కంచె లేక ప్రమాదకరంగా ఉన్న ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డు బ్రిడ్జి

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట నుంచి భాగ్యనగర్ కాలనీ వైపు వెళ్లే పాత బ్రిడ్జి కంచె విరిగిపోయి ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నాయి. నిత్యం ఈ రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు వెళ్తాయి. పాదచారులు కూడా ఇదే బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తుంటారు. ఒక్కసారిగా వాహనాలు వస్తే పాదచారులు పక్కకు నడిచే పరిస్థితి కూడా లేదు. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే పెను ప్రమాదాలు జరిగే ఆస్కారం మెండుగా ఉంది. గతంలో ఉన్న కంచెలు వాహనాలు ఢీకొనటంతో విరిగి పడిపోయాయి. వాహనాలు ఢీకొనటంతో గతంలో అనేకమంది గాయాల పాలైన సంఘటనలకు కూడా ఉన్నాయి. దీంతో నాలుగేళ్ల క్రితం పక్కనే నూతన బ్రిడ్జిని నిర్మించారు. కానీ పాత బ్రిడ్జికి మరమ్మతులు చేసిన దాఖలాలు కూడా లేవు. పాత బ్రిడ్జి, క్రొత్త బ్రిడ్జిలను కలిపి వన్‌వేలుగా వాడుతున్నారు.

◆ జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ అధికారులు రహదారులు నిర్మించే సంబంధిత శాఖాధికారులకు ఈ బ్రిడ్జి సమస్యను వివరించినా ఇప్పటి వరకు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదని పేర్కొంటున్నారు. కంచె లేకపోవడంతో స్థానికంగా ఉన్న వారు చెత్తాచెదారం తీసుకొచ్చి అక్కడే పడేస్తున్నారు. కనీసం ఆ ప్రదేశంలో లోతైన గుంత కూడా ఉందన్న హెచ్చరిక బోర్డు కూడా లేకపోవటంతో స్థానికులు, ప్రయాణికులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ బ్రిడ్జికి అనుకొని ఉన్న ఖాళీ ప్రదేశంలో చెత్త డంపింగ్ కోసం డస్ట్‌బిన్‌లు ఉండేవి.

◆ వాటిని తొలిగించిన తర్వాత జీహెచ్‌ఎంసీ సిబ్బంది సైతం చెత్తను తీసుకొచ్చి ఈ బ్రిడ్జిపైనే ఉదయం వేళల్లో డంపింగ్ చేసి మధ్యాహ్నం తరలిస్తున్నారు. దీంతో వచ్చి పోయే వారికి దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. మూగజీవాలు ఇక్కడ పడవేసిన వ్యర్థాలను తింటూ ఇక్కడే తిష్ట వేయటంతో వాహనదారులపై దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జిపై ఉన్న కంచెగోడలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాన్ని నివారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



సమన్వయంతో పనిచేయాలి

గణతంత్ర వేడుకల సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీసు గౌరవ వందనం కార్యక్రమాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం నిర్వహణ విషయాలపై సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు అవసరమైన సూచనలు చేశారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వేదికను అందంగా అలంకరించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ముఖ్య అతిథులకు గణతంత్ర దినోత్సవ ఆహ్వానపత్రాలను అందచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రగతి పై రూపొందించే నివేదిక సీపీవో ఆధ్వర్యంలో తయారు చేయాలన్నారు. జాతీయ భావం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో పాటు అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులతో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా సంబంధిత విద్యుత్తు శాఖ అధికారులు ఇప్పటి నుంచే మరమ్మతులు చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధులను ఆహ్వానించి వారికి ఆతిథ్యం అందించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్ ప్రకాశ్, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు షురూ..



హైదర్‌నగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జితేందర్, సిబ్బంది

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల బాలానగర్ బాయ్స్–1 పాఠశాల, కళాశాలలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.జితేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 5వ తరగతిలో ముస్లిం 55, క్రిస్టియన్ మైనార్టీలకు 5, బీసీలు 10, ఎస్సీలు 5, ఎస్టీ 3, ఓసీ 2 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

పాఠశాలలో..

6, 7, 8 తరగతుల వారికి ముస్లిం విద్యార్థులకు సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 82970 94093, 73311 70802లో సంప్రదించాలన్నారు.

ఇంటర్మీడియట్‌లో...

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ముస్లిం 28, క్రిస్టియన్ 2, బీసీ 5, ఎస్సీ 2, ఎస్టీ 1, ఓసీ 1 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. బైపీసీ విభాగంలో ముస్లిం 28, క్రిస్టియన్ 2, బీసీ 5, ఎస్సీ 2, ఎస్టీ 2, ఓసీ 1 సీట్లు ఉన్నాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో పలు ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆల్విన్‌కాలనీ చివరి బస్‌స్టాప్ ఫీడర్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్, ఆల్విన్ కాలనీ, ఫేజ్ 2, చక్రధర్‌నగర్ కాలనీ, ఆదిత్యానగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ సంగీత్‌నగర్ హుడాట్రిక్ పార్కు ఫీడర్ పరిధిలోని సంగీత్‌నగర్, దయార్‌గూడ, రావూస్ స్కూల్, కేఎస్‌ఆర్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చైతన్య తెలిపారు.

◆ భాగ్యనగర్‌కాలనీ: శంషీగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, సిక్కులకాలనీ, కేటీఆర్‌కాలనీ, జయశంకర్‌కాలనీ, పీజేఆర్‌నగర్, సుభాష్ చంద్రబోస్‌నగర్, గణేష్‌నగర్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ హెచ్‌ఎంటీ హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ ఫేజ్ 3, ఎంఎన్‌ఆర్ స్కూల్ వెనుక వైపు ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో..

మూసాపేట: ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలోని ఆంజనేయనగర్, జనతానగర్, మూసాపేట, యాదవబస్తీ, మూసాపేట జీహెచ్‌ఎంసీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ శంకర్ తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



ఆల్విన్‌కాలనీ రైతుబజార్ వద్ద నిర్మించిన అక్రమ నిర్మాణం



సాక్షి ఎఫెక్ట్..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్‌కాలనీ రైతుబజార్ వద్ద సర్వే నం.336లోని ప్రభుత్వ భూమి గ్రంథాలయం, ఫైర్‌స్టేషన్‌కు కేటాయించారు. కోట్లాది రూపాయల విలువైన భూమిని కొందరు వ్యక్తులు కబ్జాకు పూనుకున్నారు. ఈనెల 14వ తేదీన సర్వే నం.336లోని గ్రంథాలయం, ఫైర్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలం కబ్జా చేస్తున్నారని సాక్షి దినపత్రికలు ×పండుగ సెలవుల్లో దర్జాగా కబ్జా×అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో కూకట్‌పల్లి మండల అధికారులు స్పందించి గురువారం అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రాజకీయ నాయకులు, భూకబ్జాదారుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్థానికులు సైతం ప్రభుత్వ భూములను కాపాడటంలో ముందుకు రావాలని మండల అధికారి కోరారు.

నేడు హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: కులగణన, సామాజిక న్యాయం అనే అంశంపై హెచ్‌సీయూలో శుక్ర, శనివారాల్లో జాతీయస్థాయి సదస్సును నిర్వహించేందుకు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి సాయికిరణ్ తెలిపారు. ఈ సదస్సులో విద్యావేత్తలు, మేధావులు, సామాజిక కార్యకర్తలను ఒకతాటిపైకి తీసుకొచ్చి కులగణనపై ఉన్న అనేక అంశాలను, సందేశాలను చర్చించడం జరుగుతుందన్నారు. వర్చువల్ మోడ్‌లో కూడా జరిగే ఈ సదస్సులో ప్రముఖ విధాన రూపకర్త శ్యామ్ పిట్రోడా, ద్రావిడ కళగం కార్యదర్శి వీరమణి, డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ వెంకటేష్, ఆళ్ల రామకృష్ణ వంటి ప్రముఖులు పాల్గొంటారన్నారు.

20న ఉచితంగా 'అమెరికా అడ్మిషన్స్ డే'

పంజగుట్ట: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు ఎలా వెళ్లాలి, ఏ యూనివర్సిటీని ఎంచుకోవాలి, స్కాలర్‌షిప్ ఎలా పొందాలి అనే విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు యూని ఎక్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆపరేషన్స్ హెడ్ ఉమ తెలిపారు. అందులోభాగంగా ఈ నెల 20వ తేదీన సోమాజిగూడలోని తమ సంస్థలో ఉచితంగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అడ్మిషన్స్ డేను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. గురువారం కార్యక్రమ కరపత్రాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ ఫెయిర్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీసా రిక్రూట్‌మెంట్, అడ్మిషన్స్ రిక్రూట్‌మెంట్, స్కాలర్‌షిప్ ఆప్షన్స్, లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్స్, ట్రావెల్ అప్‌డేట్స్ తదితర అంశాలను నేరుగా తెలుసుకోవచ్చని తెలిపారు. అమెరికాకు చెందిన అన్ని ప్రముఖ యూనివర్సిటీల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 99123 28645లో సంప్రదించాలని కోరారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓ మెడికల్ షాప్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి అంజయ్యనగర్‌లో నిర్మిస్తున్న చిలకలమ్మ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. డివిజన్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

◆ అనంతరం సిరాజ్ ఉలూం మదర్సాను సందర్శించారు. మదర్సపై జరుగుతున్న సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలిన సూచించారు. ఈ సందర్భంగా మదర్సాలో నెలకొన్న సమస్యలను నిర్వాహకులు ఆయన దృష్టికి తెచ్చారు. సమస్యలను పరిష్కారిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, మహమ్మద్ జంగీర్, ఇర్ఫాన్, మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, ఖాదీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మదర్సపై ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే,కార్పొరేటర్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అంజయ్యనగర్ చిలకలమ్మ దేవాలయ కమిటీ సభ్యులు

అల్లర్లలో గాయపడిన బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



హరినగర్ బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: ఇటీవల హరినగర్‌లో జరిగిన అల్లర్లలో గాయపడిన బాధితులకు అండగా ఉంటామని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ హరినగర్‌లో బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి సంఘటనలు, అల్లర్లు జరగకుండా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట అల్లాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కూకట్‌పల్లి నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర, హరినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఏజీఐ గ్రీన్ ప్యాక్, ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కే.జోసెఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యులు బసవయ్య, మౌనికరెడ్డి పర్యవేక్షణలో వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కబీర్‌నగర్ ప్రాంత వాసులందరూ సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు.

వృద్ధులకు అన్నదానం

ఆల్విన్‌కాలనీ: సేవ్ ఏ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం దివంగత బొడ్డు శివశంకరరావు 4వ వర్ధంతిని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆల్విన్‌కాలనీలోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో ఆయన కుమార్తె బి.గీతారాణి అన్నదానం చేశారు.

చైన్ స్నాచర్ అరెస్టు

మూసాపేట: పనిమనిషి మెడలో నుంచి డెలివరీ చేసే వ్యక్తి బంగారు గొలుసు లాక్కొని వెళ్లిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కూకట్‌పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డికి చెందిన లక్ష్మి(38) భర్త లేబర్ పని చేసుకుంటూ కూకట్‌పల్లిలోని శాంతినగర్‌లో నివాసం ఉంటుంది. కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో లక్ష్మి ఇళ్లల్లో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఇళ్లల్లో పని ముగించుకొని వేంకటేశ్వరస్వామి ఆలయం పక్క వీధిలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఒక గుర్తుతెలియని వ్యక్తి బైక్ మీద వచ్చి మహిళ మెడలో నుంచి సుమారు 2 తులాల బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. ఈ మేరకు ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ఆధారంగా స్నాచర్‌ని పట్టుకొని గురువారం రిమాండ్‌కి తరలించామని ఆయన తెలిపారు. అయితే నిందితుడు మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తి నీరుడి ప్రభాకర్ (25)గా గుర్తించారు. వివేకానందనగర్‌లోనే హాస్టల్‌లో ఉంటూ జమాటో, స్విగ్గిలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు.

తెలుగు ప్రజల ఆత్మ గౌరవం ఎన్టీఆర్



మోతీనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిన మహనీయుడు, గొప్పనటుడు, రాజకీయవేత్త, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం రెండు నియోజకవర్గాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. – కూకట్‌పల్లి



వివేకానందనగర్‌లో నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



మిత్రా హిల్స్ కాలనీలో నివాళులు అర్పించిన జగదీశ్వర్ గౌడ్, బండి రమేష్, రావి శ్రీనివాస్

20న వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం దశాబ్ది ఉత్సవాలు

పంజగుట్ట: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన రవీంద్రభారతిలో సంఘం దశాబ్ది ఉత్సవాలు, రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం, 2024 డైరీ, కేలండర్, సావనీర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్, గౌరవాధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప తెలిపారు. కార్యక్రమ ఆహ్వాన పత్రికను గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంఘం ఏర్పడ్డ 10 సంవత్సరాల్లో ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా చేశామన్నారు. వీరశైవ లింగాయత్‌లకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షలను 80 శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. లింగాయత్‌లను ఓబీసీ కేంద్ర జాబితాలో కలపాలన్నారు. గత ప్రభుత్వం బసవ భవన్‌కు స్థలం, నిధులు కేటాయించిందని పనులు ముందుకు సాగడంలేదని వెంటనే బసవభవనం పూర్తి చేయాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో లింగాయత్‌లకు అవకాశం కల్పించాలని తమ డిమాండ్లు అన్ని కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సెంట్రల్ కమిటీ సభ్యులు డాక్టర్ శివప్ప, శెట్టి శివకుమార్, జి.దినేష్, రాచప్ప, కాల్వ మల్లికార్జున్, భరత్, సోమేశ్వర్, శివశరణ్, రాజశేఖర్, మహేష్, శివ, మధుసుధన్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కూచిపూడి నృత్యం

బంజారాహిల్స్: విశాఖ శ్రీశారద పీఠపాలిత ఫిలింనగర్ దైవ సన్నిధానంలో కొనసాగుతున్న స్వర నీరాజనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రీమంజీరా అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ బృందం ప్రదర్శన ఆహూతులను కట్టిపడేసింది. సీతా కల్యాణ ఘట్టం, గోదాదేవి కల్యాణ ఘట్టం, అన్నమాచార్య సంకీర్తనల నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం కళాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. దైవ సన్నిధానం పాలకమండలి కోశాధికారి కాజా సూర్యనారాయణ, సభ్యులు చుక్కపల్లి సురేష్, ప్రధాన అర్చకులు రాంబాబు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

బోరబండలో బీజేపీ 'స్వచ్ఛ అభియాన్'

రహమత్‌నగర్: ప్రధాని నరేంద్రమోడీ పిలుపుమేరకు బోరబండ బీజేపీ నాయకులు గురువారం పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ నేతృత్వంలో ఆలయాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... ఈ నెల 22 అయో.ధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా బోరబండలోని సాయిమందిరం హనుమాన్, శివాలయాలను శుభ్రం చేశారని తెలిపారు. బీజేపీ నగర కార్యవర్గ సభ్యులు కృష్ణమోహన్, దర్శన్ నాగేష్, కాట్రాజ్ రాజ్‌కుమార్, పూజారి శరణ్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ కార్తీక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్‌లో కుత్బుల్లాపూర్ ముస్లిం మేనేజ్‌మెంట్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 3వ మౌలానా ఆజాద్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలు తమకు ఇష్టమైన క్రీడ సాధన చేయాలని సూచించారు. క్రీడలతో శారీరకంగా, మానసికంగా, దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, హజ్రత్ అలీ, మూసా ఖాన్, చిన్నా చౌదరి, వహీద్, అధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్ తదితరులున్నారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

- మంజీరా పైప్‌లైన్ రోడ్డు గుంతలమయం
- ఎన్నికల వేళ హడావిడిగా రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన
- ఆపై పట్టించుకున్న వారేరీ ?





చందానగర్ చెత్త సేకరణ కేంద్రం ఎదుట..

హఫీజ్‌పేట్ : చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా పైప్ లైన్ రోడ్డు గుంతలమయంగా మారింది. చెన్నారెడ్డి హాస్పిటల్ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న పైప్ లైన్ రోడ్డు పూర్తిగా పాడైంది. గత ఎన్నికల సందర్భంగా నూతన పైప్‌లైన్ నిర్మాణం, రోడ్డు మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేశారు. అవి శిలాఫలకాలే పరిమితం అయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గుంతలు, పారుతున్న నీటితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. రోడ్డు పక్కన నడవాలంటే ఎటువైపు నుంచి వాహనాలు వస్తాయో నీరు మీదపడుతుందో అని పాదచారులు ఆందోళన చెందుతున్నారు.

◆ మంజీరా రోడ్డులో మంచినీటి పైప్‌లైన్ లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేయాలి.

◆ మంజీరా రోడ్డు, చందానగర్ చెత్త సేకరణ కేంద్రం ముందు ఏర్పడ్డ భారీ గుంతను పూడ్చి వేయాలి

◆ లింగంపల్లి బీఆర్ గ్యాస్ కంపెనీ నుంచి చందానగర్ క్రిస్టల్ గార్డెన్ వరకు వేసిన సీసీ రోడ్డును ఆర్టీసీ కాలనీ వరకు పొడిగించాలి

◆ రోడ్డు విస్తరణ చేయడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

◆ అధికారులు గుంతల రోడ్లపై ప్రత్యేక నిధుల ద్వారా నూతనంగా సీసీ రోడ్డు వేయాలి

◆ రోడ్డుకు ఇరువైపులా నో పార్కింగ్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

◆ 100 ఫీట్ల మంజీరా రోడ్డు విస్తరణకు అనుమతులను అమలు చేయాలి.

మరమ్మతులు చేయాలి



చందానగర్‌లోని మంజీరా రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలి. నిత్యం ఎక్కడో ఒకచోట పైప్ లైన్ లీకేజీలతో రోడ్డుపై నీరు ఏరులై పారుతుంది. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

–పవన్, చందానగర్

కొత్త పైప్‌లైన్ వేయాలి



లింగంపల్లి– ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డులో మూడు దశాబ్దల క్రితం తాగు నీటి పైప్‌లైన్ వేశారు. పైప్‌లైన్ శిధిలావస్థకు చేరడంతో నిత్యం లీకేజీలతో రోడ్డుపై ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వెంటనే అధికారులు నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించాలి.

–సలీం, చందానగర్